సాక్షి
మెదక్
బుధవారం । 27 । ఆగస్టు । 2025



పాపన్నపేట పాఠశాలలో వినాయకుని ఆకారంలో కూర్చున్న విద్యార్థులు
– పాపన్నపేట(మెదక్):



అధికారికి గాయాలు

రోడ్డు ప్రమాదంలో ఆయిల్‌ఫెడ్ అధికారి గాయపడ్డాడు. హుటాహుటిన వచ్చి మంత్రి తుమ్మల పరామర్శించారు. వివరాలు 10లో ▸

ఏసీబీకి చిక్కిన ఉద్యోగి



లంచం తీసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగి ఏసీబీకి చిక్కాడు. ఘటన మద్దూరులో చోటుచేసుకుంది. వివరాలు 10లో ▸

న్యూస్‌రీల్

చదువుతో పాటు క్రీడలు ముఖ్యం

డీఈఓ రాధాకిషన్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ రాధాకిషన్

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని డీఈఓ రాధాకిషన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం, హెచ్ఎంలు శేఖర్, శిరీష, శ్రీనివాస్, మారుతి, కుమార్, ప్రసన్నకుమార్, గోపి, నందయ్యగారి శ్రీను, ఆనంద్, అశోక్‌రెడ్డి తదితరులున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

డీపీఎం మల్లేశం



మాట్లాడుతున్న డీపీఎం మల్లేశం

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యమని డీపీఎం మల్లేశం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో 8వ వార్షిక మహాసభలో ఆయన మాట్లాడారు. మండలంలో మహిళా సమాఖ్య 387 గ్రూపులతో కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారికి మరింత ప్రోత్సాహం అందిస్తే ఏదైనా సాధిస్తారన్నారు. మహిళల్లో పోటీతత్వం పెరిగిందన్నారు. బదిలీపై వెళ్లిన ఐకేపీ సిబ్బంది ప్రేమలత దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం యాదయ్య, శ్రీనిధి ఆర్ఎం గంగారం, అసిస్టెంట్ మేనేజర్ పరమేశ్వరి, ఐపీఎం గౌరిశంకర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు మమత, కార్యదర్శి మాధురి, కోశాధికారి అంజలి, సీసీలు పురుషోత్తం, వరలక్ష్మి, నర్మద, వెంకటలక్ష్మి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేరుగా కాస్మొటిక్ చార్జీలు


బీసీ సంక్షేమ అధికారి జగదీష్



మెదక్ కలెక్టరేట్: విద్యార్థులకు అందించాల్సిన కాస్మొటిక్ చార్జీలను ప్రతినెలా వారి ఖాతాల్లోనే జమ చేస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్ తెలిపారు. ప్రీ మెట్రిక్–17, పోస్ట్ మెట్రిక్–4 కలిపి మొత్తం 21 బీసీ సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయన్నారు. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు మెదక్–2, నర్సాపూర్‌లో 2 ఉండగా.. 517 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. అలాగే బాలికలు–4, బాలురు–13 చొప్పున మొత్తం 17 ప్రీమెట్రిక్ హాస్టళ్లు ఉండగా.. 1,467 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. ప్రీమెట్రిక్ విద్యార్థులకు నెలకు రూ.175, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు నెలకు రూ.200, బాలికలకు అదనంగా మరో రూ.75 జమవుతుందన్నారు. అలాగే ప్రీమెట్రిక్ విద్యార్థులకు నెలకు రూ.1,430, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు రూ.1,540ల చొప్పున మెస్ చార్జీలు అందజేస్తున్నట్లు చెప్పారు.

ఎస్జీటీ పోస్టులు భర్తీ చేయాలి

పీఆర్టీయూటీఎస్ అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి



మెదక్ కలెక్టరేట్: టీచర్ల ప్రమోషన్స్ ప్రక్రియతో భారీగా ఎస్జీటీ పోస్టులు ఖాళీ అయ్యాయని, వెంటనే డీఎస్సీ ప్రకటించి భర్తీ చేయాలని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి డిమాండ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్ ఎల్ఎఫ్ఎల్ ప్రమోషన్ల ప్రక్రియతో మెదక్ జిల్లాలో సుమారుగా 200 పోస్టులు ఖాళీ అయినట్లు పేర్కొన్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల కొరతను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలన్నారు. ప్రమోషన్స్ ద్వారా కొత్త ఖాళీలు ఏర్పడటంతో సర్దుబాటు చేసే అవకాశం లేకుండా పోయిందన్నారు. విద్యార్థుల ప్రవేశాలు పెరిగిన నేపథ్యంలో తక్షణమే డీఎస్సీపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.

రోడ్డెక్కిన రైతన్న



పాసుపుస్తకాలు, ఆధార్ జిరాక్స్‌తో పాటు తాను తెచ్చుకున్న సద్దిని చూపుతున్న రైతు



రాస్తారోకో చేస్తున్న రైతులకు సంఘీభావంగా రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే, ఆయా పార్టీల నాయకులు

యూరియా కోసం రాస్తారోకో

- సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే
- స్తంభించిన వాహనాల రాకపోకలు
- రాష్ట్రంలో నికృష్ట పాలన: సునీతారెడ్డి

నర్సాపూర్: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. రాత్రనక.. పగలనక వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. యూరియా కోసం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్దకు మంగళవారం ఉదయమే ఆయా గ్రామాల రైతులు చేరుకున్నారు. తీరా యూరియా రాదని తెలియడంతో కోపోద్రిక్తులై రోడ్డెక్కారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అన్ని మార్గాల్లో వాహనాలు నిలిచిపోయాయి. చౌరస్తా మీదుగా శివ్వంపేట మండలానికి వెళుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి.. రైతులకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించారు. ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సైతం రైతులకు మద్దతుగా నిలిచారు. తహసీల్దార్ శ్రీనివాస్ వచ్చి రాస్తారోకో విరమించాలని కోరగా.. ఎమ్మెల్యే సునీతారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కొరత లేదని ప్రకటించిన విషయాన్ని ఆమె గుర్తు చేస్తూ నిలదీశారు. కాగా తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, స్థానిక సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం సముదాయించడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. దీంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రైతుల గోస పట్టదా..?

రాష్ట్రంలో నికృష్ట పాలన కొనసాగుతోందని, రైతుల గోస పట్టడంలేదని ఎమ్మెల్యే సునీతారెడ్డి మండిపడ్డారు. మంగళవారం యూరియా కోసం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టిన రైతులకు సంఘీభావం తెలిపారు. వారితో పాటు రోడ్డుపై బైఠాయించారు. ఆమెను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించగా అక్కడ విలేకరులతో మాట్లాడారు. యూరియా కావాలని అడిగితే అరెస్టులు చేయడం తగదన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల అవసరం మేరకు కేసీఆర్ యూరియా సరఫరా చేశారని గుర్తు చేశారు. యూరియా సరఫరాలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. పాస్‌బుక్కులు, ఆధార్‌కార్డుల జిరాక్స్‌లు క్యూలో పెట్టి రోజుల తరబడి నిరీక్షిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. కొందరు యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు అమ్ముతూ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి మండలానికి మూడు లారీల యూరియాను వెంటనే సరఫరా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారికి అండగా ఉంటామన్నారు.

నిబంధనలు పాటించాలి

- రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్లు వాడకూడదు
- గణేశ్ మండపాల నిర్వాహకులకు ఎస్పీ శ్రీనివాసరావు సూచన
- ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ మున్సిపాలిటీ: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నేరాల పరిస్థితి, శాంతిభద్రతల పర్యవేక్షణ, పెండింగ్ కేసుల పరిష్కారం వంటి అంశాలపై సమీక్షించారు. పోలీసు అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. మండపాల వద్ద రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్లు వాడకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసి, ఉత్సవ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రేవ్ కేసులు వేగంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు.

ఆధునిక సాంకేతిక పద్ధతులు

ముఖ్యంగా మహిళలు, పిల్లలపై నేరాల దర్యాప్తు వేగవంతం చేసి, కోర్టుల్లో చార్జిషీట్లు సకాలంలో సమర్పించి కన్విక్షన్ రేట్ పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచాలని, కేసుల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. నమోదైన అన్ని కేసులను సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించి త్వరగా పరిష్కరించాలని, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటి ద్వారా నేరాలను అరికట్టడం మరియు నేరస్తులను త్వరగా గుర్తించడం సాధ్యం అవుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్ నరేందర్ గౌడ్ , సుభాష్ చంద్ర బోస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉంటాం

నర్సాపూర్: డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు విద్యార్థులకు హితవు పలికారు. మంగళవారం స్థానిక బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ క్రైం , ర్యాగింగ్ తదితర అంశాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలతో ఆరోగ్యం పాడవడంతో పాటు కుటుంబమంతా సంక్షోభంలోకి వెళ్తుందన్నారు. సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేయొద్దని సూచించారు. ర్యాగింగ్ చేస్తే కఠిన తీసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలో విద్యార్థులతో డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, సైబర్ క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, స్థానిక సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం, కాలేజీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 74 అంబులెన్సులు

ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్ షాహిద్



108 సాంకేతిక సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ: జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 74 అంబులెన్స్‌లు (108 వాహనాలు) సేవలందిస్తున్నట్లు ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్ షాహిద్ తెలిపారు. మొత్తం 170 మంది సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారని చెప్పారు. వీరికి ఆరు నెలలకోసారి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. దీంతో వైద్య పద్ధతులపై శిక్షణ, మెలకువలు మాతా శిశు మరణాల రేటును తగ్గుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లాలో మంజీర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

గీత కార్మికులకు 25% కేటాయించాలి: ఆశన్నగౌడ్

సంగారెడ్డి టౌన్: మద్యం దుకాణాల టెండర్లలో కల్లు గీత కార్మికులకు 25% కేటాయించాలని ఆ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి పట్టణంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మద్యం దుకాణాల టెండర్ల వల్ల గీత కార్మికుల ఉపాధి కోల్పోతున్నారని 15% రిజర్వేషన్ జీవో నంబర్ 93ను సవరించి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 25% పెంచి కల్లుగీత సొసైటీలకు అందజేయాలని కోరారు.

మట్టి ప్రతిమలు ప్రతిష్ఠించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- 2 వేల గణేశ్ ప్రతిమల పంపిణీ



కలెక్టరేట్‌లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీలు, భక్తులు మట్టి గణనాథులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ కోరారు. మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ కాలుష్య రహిత వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి.. సాంప్రదాయ బద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఏదైనా సమస్యలుంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1912 లేదా స్థానిక లైన్‌మెన్‌ను సంప్రదించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండండి

రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం జాతీయ స్థాయిలో కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన నితన్యసిరిని ఆయన అభినందించారు. పోస్టల్ సిబ్బంది ద్వారా పెన్షన్లు పంపిణీ కోసం మంజూరైన 111 సెల్‌ఫోన్లు, వేలిముద్ర యంత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, బీసీ సంక్షేమ అధికారి జగదీష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా జ్వర సర్వే

పాపన్నపేట(మెదక్): సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. మంగళవారం పాపన్నపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జ్వర సర్వే పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా జిల్లాలోని ఆసుపత్రులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమయపాలన పాటిస్తూ రోగులకు సరైన వైద్యసేవలు అందజేయాలని చెప్పారు.

ముఖ గుర్తింపుతో పింఛన్లు

- అవినీతికి చెక్ పెట్టేందుకే..
- జిల్లా కేంద్రానికి చేరిన సెల్‌ఫోన్లు, స్కానర్లు



రామాయంపేట(మెదక్): పింఛన్ల పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. ఈ మేరకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంది. ఇక నుంచి ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నైజేషన్) ఆధారంగా పింఛన్లు పంపిణీ చేయనున్నారు. దీంతో పంపిణీలో అక్రమాలు అరికట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. గత నెల నుంచే ఈ విధానంతో కొన్ని జిల్లాల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. మెదక్ జిల్లాలో సెప్టెంబర్ నుంచి మొదలు కానుంది. జిల్లాలో 1,11,808 పింఛన్‌దారులు ఉన్నారు. సింహ భాగం పింఛన్ల పంపిణీపోస్టాఫీసుల ద్వారానే జరుగుతుంది. ఈ మేరకు జిల్లాకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో రూపొందించిన 111 సెల్‌ఫోన్లతోపాటు బయోమెట్రిక్ మిషన్లు, స్కానర్లు మంజూరయ్యాయి. వీటిని జిల్లా కేంద్రంలోని గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో భద్రపర్చారు. వీటిని పోస్టాఫీసుల్లో పోస్టుమాస్టర్లకు అందజేయనున్నారు. వీటి సహాయంతో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. జిల్లా పరిధిలో పింఛన్లను పోస్టాఫీసుల ద్వారానే లబ్ధిదారులకు అందిస్తుండగా, మిగతావి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. అంధులు, దివ్యాంగులు ఉంటే పంచాయతీ కార్యదర్శుల ద్వారానే వారికి పింఛన్లు అందనున్నాయి.

> **ఇది మంచి పరిణామం**
>
> 
>
> ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ల పంపిణీ మంచి పద్ధతి. దీంతో లబ్ధిదారుల కష్టాలు తీరనున్నాయి. ముఖ గుర్తింపుతో డబ్బులు నేరుగా అందుతాయి. అంధులుంటే పంచాయతీ కార్యదర్శుల సహాయంతో వారికి అందేలా ఏర్పాటు చేస్తున్నాం.
>
> – శ్రీనివాసు, డీఆర్డీవో, మెదక్

మహిళా సంఘాలు మార్కెటింగ్ చేయాలి

డీఆర్డీఏ అసిస్టెంట్ పీడీ సరస్వతి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న సరస్వతి

చేగుంట(తూప్రాన్): మహిళా సంఘాలు గ్రూపుగా ఏర్పడి మార్కెటింగ్ చేయాలని డీఆర్డీఏ అసిస్టెంట్ పీడీ సరస్వతి అన్నారు. చేగుంట ఐకేపీ కార్యాలయంలో 17వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు గ్రూపుగా ఏర్పడి పిండిమర, హోటల్, ఫుడ్‌ప్రాసెసింగ్, కోళ్ల పెంపకం వంటి యూనిట్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని కొన్ని సంఘాల సభ్యులు గ్రూపు వ్యాపారాలను నిర్వహించి నెలకు రూ.50 వేల సంపాదిస్తున్నారని చెప్పారు. గ్రామాల్లోని అన్ని రకాల వయస్సు మహిళలతో సంఘాలను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామ, మండల సంఘాలు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం లాలు, ఏపీఎం దుర్గాప్రసాద్, ఎంపీడీఓ చిన్నారెడ్డి, సీసీలు స్వామి, అంజ్య, స్వేత సిబ్బంది పాల్గొన్నారు.

సమైక్య సంఘాలను బలోపేతం చేయాలి

తూప్రాన్: గ్రామాల్లో సమైక్య సంఘాలను బలోపేతం చేయాలని డీఆర్డీఏ అసిస్టెంట్ పీడీ సరస్వతి పేర్కొన్నారు. మంగళవారం మండలం మహిళా సమైక్య 21వ వార్షిక మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంఘాలు లేని వారిని సంఘంలో చేర్చుట, వృద్ధుల సంఘాలు, వికలాంగుల సంఘాలు, కిశోర బాలికల సంఘాలు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్థికంగా ప్రతి మహిళ అభివృద్ధి చెందేలా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వివరించారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర్లు, మండల సమైక్య అధ్యక్షురాలు రోజా, కోశాధికారి నర్మదా పాల్గొన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని పెద్దచెరువు, ధర్మాసాగర్ పటేల్ చెరువు కింద ఆయకట్టు వరి పంట పచ్చని రంగులతో కళకళలాడుతుంది. మండల వ్యాప్తంగా సుమారు వేల ఎకరాల్లో వరి సాగు చేయడంతో ఎటు చూసినా పచ్చని పొలాలతో కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి చెరువు కుంటలు నిండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కూచన్‌పల్లి, సర్దన మంజీరా పరివాహక ప్రాంతంలో పంటలు నీట మునిగాయి. దీంతో పెట్టిన పెట్టుబడితో పాటు పంట నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. దాదాపు 30 ఎకరాల్లో సాగు చేసిన వరి పంటలు మంజీరా వరద ఉధృతితో మునిగిపోయాయన్నారు. దీంతో పూర్తిగా వరి కుళ్లి తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.

రూ.3 కోట్లకుపైగా బకాయిలు

- ఐదు నెలలుగా అందని కమీషన్
- ఆందోళనబాటలో రేషన్ డీలర్లు



మెదక్‌జోన్: రేషన్ బియ్యానికి సంబంధించిన కమీషన్‌ను ప్రభుత్వం డీలర్లకు ఇవ్వకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఐదు నెలలకు సంబంధించి డీలర్లకు రూ.3 కోట్లకు పైగా బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో రేషన్ దుకాణాలు నడపడంలోనూ, కుటుంబాలు పోషించుకోవడంలోనూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఈ నెలాఖరుకల్లా కమీషన్ బకాయిలు చెల్లించకుంటే ఆందోళనబాట పడతామని డీలర్లు హెచ్చరిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 520 రేషన్ దుకాణాలు

జిల్లావ్యాప్తంగా 520 రేషన్ దుకాణాలు ఉండగా ప్రతీ నెల 4,800 మెట్రిక్‌టన్నుల బియ్యాన్ని 490మంది డీలర్లు పంపిణీ చేస్తున్నారు. క్వింటాకు రూ.140 చొప్పున డీలర్‌కు కమీషన్ ఇస్తోంది. ఇందులో కేంద్రం రూ.90, రాష్ట్ర ప్రభుత్వం రూ.50 చొప్పున చెల్లిస్తున్నాయి. సకాలంలో కమీషన్ ఇవ్వకపోవడంతో రేషన్ దుకాణాల అద్దె, కరెంట్ బిల్లులు, స్కూల్ ఫీజులు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని డీలర్లు వాపోతున్నారు. రేషన్‌షాపులను డీలర్లు అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు. ప్రతీ నెల వీటికి అద్దె చెల్లించడంతోపాటు బియ్యం కోటా రాగానే వాహనాల్లోనుంచి బియ్యం దించేందుకు హమాలీలకు కూలీ చెల్లిస్తున్నారు.

గతంలో 9 రకాల సరుకులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కన్నా ముందు రేషన్‌షాపులకు బియ్యంతోపాటు కిరోసిన్, పప్పులు, పంచదార వంటి సరుకులను రేషన్ ఇచ్చేవారు. దీంతో సదరు డీలర్‌కు సైతం అన్ని రకాల వస్తువులపై కమీషన్ వచ్చేది. ప్రస్తుతం బియ్యం మాత్రమే సరఫరా చేస్తుండటంతో వచ్చే కమీషన్ కనీసం హమాలీల కూలీ కూడా రావడం లేదని వాపోతున్నారు.

ఆందోళన తప్పదు



ఐదు నెలలుగా కమీషన్ ఇవ్వటంలేదు. నెలాఖరుకల్లా కమీషన్ డబ్బులు ఇవ్వకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తాం.
– ఆనందం, రేషన్‌డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఉన్నతాధికారులకు పంపించాం



డీలర్లకు రావాల్సిన కమీషన్ వివరాలను ఉన్నతాధికారులకు అందించాం. ప్రభుత్వం త్వరలోనే చెల్లించే యోచనలో ఉంది.
– నిత్యానందం, డీఎస్ఓ, మెదక్

క్లుప్తంగా

రాజీ మార్గంతోనే కేసుల పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర



మాట్లాడుతున్న న్యాయమూర్తి భవానీ చంద్ర

సంగారెడ్డిటౌన్‌: సెప్టెంబర్‌ 13న జరిగే జాతీయ లోక్‌ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టులో ఇన్సూరెన్స్‌ కంపెనీలు, చిట్‌ ఫండ్‌ సంస్థలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బ్యాంకు మొండి బకాయిలు, చిట్‌ ఫండ్‌ కేసులను లోక్‌ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ ట్యాంకర్‌ టైర్లు చోరీ



మద్దూరు(హుస్నాబాద్‌): వాటర్‌ ట్యాంకర్‌ టైర్లు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా... గ్రామంలోని పంచాయతీకి చెందిన వాటర్‌ ట్యాంకర్‌ను నర్సరీ వద్ద ఉంచారు. సోమవారం రాత్రి టైర్లను డిస్కులతో సహా దొంగలు ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుంది. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి అశోక్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో ట్రాక్టర్ల బ్యాటరీలను ఎత్తుకెళ్లిన దొంగలు టైర్లను కూడా వదలకపోవడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



సిద్దిపేటకమాన్‌: వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. వన్‌ టౌన్‌ సీఐ వాసు దేవ రావు వివరాల ప్రకారం... పట్టణంలోని మోడ్రన్‌ బస్టాండ్‌లో కామారెడ్డి వైపు బస్సులు వెళ్లే ప్లాట్‌ ఫామ్‌ వద్ద సుమారు 55 ఏళ్ల వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు బస్టాండ్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా అతడి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. దీంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు రెండు రోజులుగా బస్టాండ్‌ పరిసర ప్రాంతంలో తిరుగుతూ నిద్రిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మండలంలోని పెద్దాపూర్‌ గ్రామ శివారులోని ముంబై జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని అత్తాపూర్‌కు చెందిన కాశీరాం(22) వ్యక్తిగత పని నిమిత్తం జహీరాబాద్‌ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం అతడు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాకింగ్‌కు వెళ్లొస్తుండగా చైన్‌ స్నాచింగ్‌

బైక్‌పై వచ్చిన దుండగులు

పటాన్‌చెరు టౌన్‌: వ్యక్తి మెడలో నుంచి బంగారు గొలుసును దుండగులు తస్కరించారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... ఇస్నాపూర్‌ మున్సిపాలిటీకి చెందిన రంగారావు పట్టణ చౌరస్తా నుంచి ముత్తంగి చర్చి వరకు రోజు మాదిరిగానే మంగళవారం తెల్లవారు జామున వాకింగ్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు పూజా ఆస్పత్రి ఎటువైపు ఉందని హిందీలో అడిగారు. దీంతో రంగారావు తనకు తెలియదని చెప్పాడు. వారు అక్కడ నుంచి బైక్‌పై ముందుకు వెళ్లారు. తిరిగి ఇస్నాపూర్‌ సర్వీస్‌ రోడ్డు నుంచి వచ్చి దుండగులు రంగారావు మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాట్య మయూరం



చిరు జల్లుల సవ్వడిలో.. పచ్చని పొలాల్లో మయూరం తిరుగుతూ వయ్యారాలు ఒలకబోసింది. పురివిప్పి నాట్యం చేసి చూపరులను ఆకట్టుకుంది. సిద్దిపేట పట్టణ శివారులోని గడిచెర్ల సమీపంలో పచ్చని పొలాల్లో నెమలి నాట్యం చేస్తున్న దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌ మనిపించింది ఇలా...

-సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, సిద్దిపేట

పర్యావరణ హితం.. మట్టి వినాయకులు

నాలుగు తరాలుగా తయారీలో బ్రహ్మచారి కుటుంబం



కౌడిపల్లిలో మట్టి వినాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్‌): మట్టి వినాయకులను నాలుగు తరాలుగా మండల కేంద్రానికి చెందిన అవుసలి బ్రహ్మచారి కుటుంబం తయారు చేస్తోంది. గ్రామానికి చెందిన బ్రహ్మచారి తాత ముత్తాతల నుండి వినాయకులను తయారు చేస్తుండగా నేడు అదే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. చెరువు మట్టిని తీసుకువచ్చి వినాయకుడు, ఆవు, ఎద్దు, బండి తయారు చేస్తారు. గతంతో తయారు చేసిన మట్టి గణపతులను గ్రామస్తులకు ఇచ్చేవారు. కాగా ప్రస్తుతం రూ.50 వరకు అమ్ముతున్నారు. ఆనవాయితీ, నైపుణ్యాన్ని పడగొట్టవద్దనే ఉద్దేశంతో పండగకు రెండు రోజుల ముందు నుంచి తయారు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో మట్టి వినాయకులు మాత్రం ఉండేవని ప్రస్తుతం రసాయనాలతో తయారు చేసిన వాటిని పూజిస్తున్నారని పేర్కొన్నారు. అవి పర్యావరణానికి హాని చేస్తాయని తెలిపారు. అయినప్పటికీ మట్టి వినాయకులను ప్రత్యేకంగా తన వద్దకు వచ్చి తీసుకువెళ్లేవారు ఉన్నారని చెప్పారు. అందరూ పర్యావరణ హిత మట్టి గణనాథులను పూజించాలని సూచించారు.



తయారు చేసిన మట్టి ప్రతిమలతో బ్రహ్మచారి

కరెంట్‌ సమస్యలకు చెక్‌

విద్యుత్‌లో సాంకేతిక ఒరవడి

- సత్వరమే ఎఫ్‌ఓఎంఎస్‌లతో పరిష్కారం
- జిల్లాలో 477 ఫీడర్లు
- అన్నింటికి యూనిట్ల బిగింపు

మెదక్‌ కలెక్టరేట్‌: ఒకప్పుడు వర్షాకాలం వచ్చిందంటే వానతోపాటు ఈదురు గాలుల కారణంగా అనేక విద్యుత్‌ సమస్యలు వచ్చేవి. దీంతో ఆ సమస్యలను పరిష్కరించాలంటే రోజుల సమయం పడుతుంది. లైన్‌మెన్‌లు, అధికారులు వెతికి వెతికి సమస్యను గుర్తించాల్సి వచ్చేది. ప్రస్తుతం వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ అందించే లక్ష్యంగా విద్యుత్‌ శాఖ సాంకేతిక ఒరవడిపై దృష్టి పెట్టింది. రైతులు, ప్రజలు, వ్యాపారులు, పరిశ్రమలకు నిరంతరం విద్యుత్‌ అందించేందుకు చర్యలు చేపడుతుంది. అందులో భాగంగా సాంకేతిక పరమైన ఎఫ్‌ఓఎంఎస్‌ యూనిట్లను తీసుకొచ్చింది. వీటితో ఎక్కడైన విద్యుత్‌ సమస్య ఏర్పడితే క్షణాల్లో స్పాట్‌ను గుర్తించి సమస్యను పరిష్కరిస్తారు. జిల్లాలోని పలు ఫీడర్లకు ఎఫ్‌ఓఎంఎస్‌ (ఫీడర్‌ ఔట్‌ మేనేజ్‌మెంట్‌ సిస్టమ్‌)లను అమర్చారు.

క్షణాల్లో పరిష్కారం

జిల్లాలో 33, 11 కేవీ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లు మొత్తం 127 ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న 477 ఫీడర్లకు ఎఫ్‌ఓఎంఎస్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో ఎఫ్‌ఓఎంఎస్‌ 65 విద్యుత్‌ స్తంభాల పరిధిలో పనిచేస్తుంది. దీని గురించి తెలుసుకునేందుకు జిల్లాలోని అన్ని విద్యుత్‌ స్తంభాలకు నంబర్లు వేశారు. ఎక్కడ సమస్య వచ్చినా నిమిషాల్లో సమాచారం వస్తుంది. ఫలితంగా విద్యుత్‌ సిబ్బంది సమస్యను వెతకాల్సిన ఇబ్బందులు తగ్గుతాయి.



పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లి ఫీడర్‌కు బిగించిన ఎఫ్‌ఓఎంఎస్‌

ఎఫ్‌ఓఎంఎస్‌ల పనితీరు

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ అందించేందుకు విద్యుత్‌ శాఖ జిల్లాలోని పలు ఫీడర్లకు ఎఫ్‌ఓఎంఎస్‌లను ఏర్పాటు చేసింది. ఎక్కడైన విద్యుత్‌ సమస్య ఏర్పడితే క్షణాల్లో గుర్తించేందుకు ఇవి పనిచేస్తాయి. ఎఫ్‌ఓఎంఎస్‌ యూనిట్‌కు మూడు ఇండికేటర్లు ఉంటాయి. విద్యుత్‌ ఫీడర్లకు మూడు విద్యుత్‌లైన్‌లను ఇవి కవర్‌ చేస్తాయి. ఏ లైన్‌లో విద్యుత్‌ సమస్య ఏర్పడితే ఆ లైన్‌ ఇండికేటర్‌ వెలుగుతుంది. వీటిలో సిమ్‌కార్డు ఉండటం వల్ల సమస్య ఏర్పడిన లొకేషన్‌తో స్థానికంగా ఉండే లైన్‌మెన్‌కు ఏఈ, ఏడీఈల సెల్‌ఫోన్‌లకు సమాచారం పంపిస్తుంది. వీటి ద్వారా విద్యుత్‌ సమస్య ఏర్పడితే సులువుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. అధికారులు తక్షణం స్పందించి అక్కడికి చేరుకుని పరిష్కరిస్తారు. ఫలితంగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ అందుతుంది. అధికారులు క్షణాల్లో స్పందించి సమస్య పరిష్కరించడంతో విద్యుత్‌ ప్రమాదాలు కూడా తగ్గనున్నాయి.

నాణ్యమైన విద్యుత్‌ అందిస్తాం



జిల్లాలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ అందించడం లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఎప్పటికప్పుడు విద్యుత్‌ శాఖలో సాంకేతిక ఒరవడిని తీసుకొస్తున్నాం. ఇందులో భాగంగా ఎఫ్‌ఓఎంఎస్‌లు బిగించాం. దీంతో చాలా వరకు విద్యుత్‌ సమస్యలు క్షణాల్లో పరిష్కరిస్తూ నాణ్యమైన విద్యుత్‌ అందిస్తున్నాం.

- నారాయణ నాయక్‌, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ, మెదక్‌

భుజిరంపేటలో రాతి గణపతి

వినాయక చవితితోపాటు ప్రతినెల సంకట చతుర్థి రోజు పూజలు



కొలువుదీరిన రాతి గణపతి విగ్రహం

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండల పరిధిలోని భుజిరంపేటలో వినాయకుని ఆలయంలోని రాతి గణపతి ప్రతి నెల భక్తుల పూజలందుకుంటుంది. గ్రామంలోని చెరువు అలుగు వద్ద గల సుమారు 75 ఏళ్ల నాటి రాతి గణపతి ఉండగా రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి భుజిరంపేటలో శ్రీకృష్ణాశ్రమానికి వచ్చినప్పుడు విగ్రహాన్ని పరిశీలించి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆయన సూచన మేరకు గ్రామస్తులు 2015లో అక్కడే ఆలయం నిర్మించి అందులో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి గ్రామ పురోహితుడు జోషి గోపాలశర్మ, గ్రామస్తులు ప్రతినెల సంకట చతుర్థి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామస్తులు, వివిధ గ్రామాలవారు గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు.



భుజిరంపేటలోని వినాయకుని ఆలయం

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

పది రోజుల తర్వాత శవం లభ్యం

కొల్చారం(నర్సాపూర్‌): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి నదిలో గల్లంతై పది రోజుల తర్వాత శవమై తేలాడు. ఈ ఘటన మండలంలోని ఎర్రగండ్ల గ్రామంలో మంగళవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ హైమద్‌ మోహినొద్దీన్‌ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఏషబోయిన దుర్గేశ్‌(38) ఈనెల 17న గ్రామ శివారులో ప్రవహిస్తున్న మంజీరా నదిలోకి చేపల కోసం వెళ్లాడు. వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో నదిలో గల్లంతయ్యాడు. ప్రస్తుతం ఎగువ నుంచి నది నీటి ప్రవాహం తగ్గడంతో కోనాపూర్‌ గ్రామ రైతులు నది వైపు వెళ్లారు. వారికి నదిలో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించి దుర్గేశ్‌గా నిర్ధారించారు. మృతుని భార్య శైలజ పోలీసులకు ఫిర్యాదు చేసింది.



దుర్గేశ్‌

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఉద్యోగి

మద్దూరు(హుస్నాబాద్‌): లంచం తీసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగి ఏసీబీకి చిక్కాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని ఉపాధి హామి కార్యాలయంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే... జాతీయ ఉపాధిహామి పథకం కార్యాలయంలో ఈజీఎస్‌లో ఈసీ (ఇంజనీరింగ్‌ కన్సెల్టెంట్‌)గా పని చేస్తున్న బండకింది పరశురాములు తన కింది ఉద్యోగి వద్ద ఫైళ్ల చెక్‌, కొలతల ధృవీకరణ, బిల్లు ఆమోదం కోసం ఉన్నతాధికారులకు ఫైల్‌ను పంపేందుకు లంచం డిమాండ్‌ చేశాడు. అంత నగదును ఇవ్వలేనని తగ్గించాలని అతడు బ్రతిమిలాడినా వినలేదు. దీంతో సదరు ఉద్యోగి ఈనెల 20న అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం మధ్యాహ్నం ఉద్యోగి నుంచి పరశురాములు రూ.11,500 లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్లు ఏసీబీ మెదక్‌ రేంజ్‌ డీఎస్పీ సుదర్శన్‌ తెలిపారు. నగదును స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసి హైదరాబాద్‌ నాంపల్లిలోని అదనపు స్పెషల్‌ జడ్జి, ఏసీబీ ఎదుట హాజరు పర్చనున్నట్లు తెలిపారు. ఉపాధి హామి కార్యాలయంతోపాటు పరశురాములు స్వగ్రామమైన చేర్యాల మండలం శభాష్‌గూడెంలోని అతని ఇంట్లో కూడా సోదాలు నిర్వహించారు. కాగా నిందితుడికి ఈనెల 15న ఉత్తమ అవార్డు రావడం గమనార్హం.



పట్టుబడిన ఈసీ పరశురాములు

రోడ్డు ప్రమాదంలో అధికారికి గాయాలు

పరామర్శించిన మంత్రి తుమ్మల

గజ్వేల్‌: రోడ్డు ప్రమాదంలో అధికారి గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... నర్మెటలో ఉన్న ఆయిల్‌ఫామ్‌ ఫ్యాక్టరీలో సమావేశానికి మంగళవారం ఆయిల్‌ఫెడ్‌ అధికారి ప్రశాంత్‌కుమార్‌ వెళుతున్నాడు. ఈ క్రమంలో మండలంలోని రిమ్మనగూడ వద్ద రాజీవ్‌ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమావేశంలో పాల్గొనేందుకు సిరిసిల్ల వైపు నుంచి వస్తున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. ప్రశాంత్‌కుమార్‌కు ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాద ఘటనతో సమావేశం వాయిదా పడింది.



ఆస్పత్రిలో ప్రశాంత్‌కుమార్‌ను పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

విద్యుదాఘాతంతో గేదె మృతి

రామాయంపేట(మెదక్‌): మండలంలోని దంతేపల్లిలో మంగళవారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన గొల్ల రమేశ్‌ కు పాడి గేదె ఉంది. గడ్డి మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద షాక్‌నకు గురై అక్కడిక్కడే మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశాడు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

వట్‌పల్లి(అందోల్‌): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం అందోల్‌ మండలంలోని ఏరువాక కేంద్రం బోధన సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమోషన్ల నిరాకరణ, శాస్త్రీయత లేని స్కోరుకార్డు రూపకల్పన 3 నెలలుగా ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తిని రగిలిస్తోందన్నారు. సహేతుకత, విశ్వసనీయత లేని అసంబద్ధ స్కోర్‌ కార్డు రూపకల్పనతో ఉద్యోగులు ప్రమోషన్లలో నిరాకరణకు గురికావాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త రాహుల్‌ విశ్వకర్మ పాల్గొన్నారు.

భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక సేవలు

సిద్దిపేటకమాన్‌: పుణ్యక్షేత్రాలను దర్శించుకునే భక్తులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు సిద్దిపేట డిపో మేనేజర్‌ రఘు తెలిపారు. ఈ నెల 30న పట్టణ డిపో నుంచి అన్నవరం, సింహాచలం, బొర్ర గుహలు, ఆర్‌కే బీచ్‌, కైలాసగిరివంటి పుణ్యక్షేత్రాలకు సూపర్‌ లగ్జరీ బస్సు నడపనున్నట్లు పేర్కొన్నారు. పై ప్రాంతాల సందర్శన, దేవాలయాల దర్శనానంతరం తిరిగి బస్సు వచ్చే నెల 2న సిద్దిపేటకు చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు రూ.4 వేలు, పిల్లలకు రూ.3 వేలు టికెట్‌ చార్జీ ఉంటుందని, భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో వృద్ధురాలు ఆత్మహత్య

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... జగదేవ్‌పూర్‌కు చెందిన ఎర్ర రామవ్వ(60)కు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుర్లున్నారు. రామవ్వ భర్త మైసయ్య నాలుగేళ్ల క్రితం మృతి చెందగా అప్పటి నుంచి ఒంటరిగా జీవిస్తుంది. కొంతకాలంగా కడుపునొప్పి, ఫిట్స్‌తో బాధపడుతున్న రామవ్వ సోమవారం సాయంత్రం తన గదిలో దూలానికి ఉరివేసుకుంది. మంగళవారం ఉదయం ఆమె కొడుకు సత్యనారాయణ గది తలుపులను పగులగొట్టి చూడగా ఉరివేసుకొని చనిపోయి కనిపించింది.



రామవ్వ మృతదేహం

పురుగుల మందు తాగి వృద్ధుడు..

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని పీర్లపల్లిలో మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మాదబోయిన మల్లయ్య(80)కు వివాహం కాకపోవడంతో అతని బాగోగులను తమ్ముడి కొడుకులు చూసుకుంటున్నారు. మండల కేంద్రంలో తిరుగుతూ సాయంత్రానికి ఇంటికి చేరుకునే మల్లయ్య సోమవారం రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. మంగళవారం ఉదయం జగదేవ్‌పూర్‌ మార్కెట్‌లో పురుగుల మందు తాగి వ్యక్తి చనిపోయినట్లు పోలీసులకు సమాచారం అందింది. విచారణ చేపట్టిన పోలీసులు మల్లయ్య మృతదేహంగా గుర్తించి గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్‌

వర్గల్‌(గజ్వేల్‌): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్‌ చేశారు. మంగళవారం కేసుకు సంబంధించి గజ్వేల్‌ రూరల్‌ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. వర్గల్‌ శివారులో కొంతమంది గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. వెంటనే అక్కడకు వెళ్లి అనుమానాస్పదంగా కనిపిస్తున్న వేలూరుకు చెందిన అరిగె ఆంజనేయులు(22), తూప్రాన్‌కు చెందిన తుమ్మల ప్రశాంత్‌ (20), మామిడి నికిత్‌ రెడ్డి(19)లను అదుపులోకి తీసుకున్నారు. వారి బైక్‌ కవర్‌లో ఉన్న 93 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నాందేడ్‌ పట్టణానికి చెందిన విజయ్‌ బాలేరావ్‌ వద్ద గంజాయి కొనుగోలు చేసి వేలూరు, వర్గల్‌ తదితర ప్రాంతాల్లో లేబర్‌, యువకులకు అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి బైక్‌, నాలుగు మొబైల్‌ ఫోన్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

మార్కెట్‌కు ‘మొక్కజొన్న’

- పచ్చి కంకులు అమ్మడానికి రైతుల ఆసక్తి
- జోరుగా కొనుగోళ్లు

జహీరాబాద్‌ టౌన్‌: సీజన్‌ కావడంతో జహీరాబాద్‌ మార్కెట్‌కు మక్క కంకులను రైతులు తీసుకొస్తున్నారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కజొన్న రైతులు పచ్చి కంకులనే అమ్ముకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ధర గిట్టుబాటు అవుతుండటంతో అమ్మకాలు, కొనుగోళ్లతో మార్కెట్‌ కళకళలాడుతోంది.

జహీరాబాద్‌ వ్యవసాయ డివిజన్‌లో పత్తి, కంది, సోయాబీన్‌ తరువాత మొక్కజొన్నను రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. కొంత మంది రైతులు చెరకులోనూ అంతరపంటగా మొక్కజొన్న పండిస్తుంటారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది డివిజన్‌లో మొక్కజొన్న సాగు విస్తీర్ణం 75 శాతం వరకు పెరిగింది. జహీరాబాద్‌, న్యాల్‌కల్‌, మొగుడంపల్లి, కోహీర్‌, ఝరాసంగం తదితర మండలాల్లో రైతులు గత సంవత్సరం 3 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ సంవత్సరం సుమారు 11 వేల ఎకరాల్లో పంట సాగవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. మొక్కజొన్నకు కేంద్రం కనీస మద్దతు ధర రూ. 2,360 ప్రకటించడం వల్ల గిట్టుబాటవుతుందని సాగుకు మొగ్గు చూపారు.

మార్కెట్‌లో కొనుగోళ్లు..

సీజన్‌ కావడంతో మార్కెట్‌కు రైతులు పచ్చి కంకులను తీసుకొస్తున్నారు. వర్షాల కారణంగా మొక్కజొన్న కంకులను(బుట్టాలు) ఎండబెట్టడం శ్రమతో కూడుకున్న పని కారణంగా రైతులు పచ్చి కంకులనే విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. పట్టణంలోని పశువుల సంత వద్ద రహదారి పక్కనే మార్కెట్‌ ఉండటంతో దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారు వాహనాలను ఆపి కంకులను కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో ప్రస్తుత ధర కిలోకు రూ.16 నుంచి 20 వరకు పలుకుతోంది. గిట్టుబాటు ధర లభిస్తుండటంతో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. చిరువ్యాపారులు కాల్చిన ఒక్కో కంకిని రూ. 20కు అమ్ముతున్నారు.



జహీరాబాద్‌ మార్కెట్‌కు వచ్చిన మొక్కజొన్న కంకులు

‘పోచారం’.. సోయగం



మెదక్‌ జిల్లా సరిహద్దులో ఉన్న పోచారం డ్యామ్‌ కొన్ని రోజులుగా పొంగి పొర్లుతుండటంతో ఆ అందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వరద ఉధృతి ఉందన్న సాకుతో జిల్లా అధికారులు ఎవరిని అనుమతించలేదు. అయితే ఈ విషయంపై ‘సాక్షి’లో పోచారం డ్యామ్‌పై ఆంక్షలు అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు మంగళవారం నుంచి పర్యాటకులు వెళ్లేందుకు అనుమతించారు. దీంతో పర్యాటకుల సందడి పెరగనుంది.

- హవేళిఘణాపూర్‌(మెదక్‌)



పచ్చని అందాలతో కనువిందు చేస్తున్న పోచారం డ్యామ్‌